క్లుప్తంగా

దేవి ఆలయానికి విరాళం



చెక్కును అందిస్తున్న శ్రీనివాసరావు

మధురపూడి: కోరుకొండ మండలం గాడాలలోని దేవి అమ్మవారి ఆలయానికి రంగులు వేయడానికి బీజేపీ నేత, విశ్వ హిందూధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు రూ.1,20,000 చెక్కును ఆదివారం అందజేశారు. ఆలయ కమిటీ కోరిక మేరకు కంబాల గోకవరంలోని ఆయన కార్యాలయంలో ఈ చెక్కును అందించారు.

సూర్యదేవునికి పంచామృతాభిషేకాలు



జి.మామిడాడలో ప్రత్యేక అలంకరణలో ఉన్న సూర్యదేవుడు, దేవేరులు

పెదపూడి: జి.మామిడాడలో ప్రసిద్ధి చెందిన శ్రీ ఉషా, ఛాయ, పద్మిని, సొంజ్ఞ సమేత సూర్యదేవునికి ఆదివారం పంచామృతాభిషేకాలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి వెంకటనరసింహాచార్యులు అధ్వర్యంలో ఆలయంలో వ్రత పూజలు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. భక్తులకు ఆలయ కమిటీవారు, తీర్థ ప్రసాదాలు, అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

వక్తృత్వ పోటీల్లో ఫస్ట్



సర్టిఫికెట్ తీసుకుంటున్న గిడియానా

రాజానగరం: కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సూరంపాలెం ఆదిత్య కళాశాలలో 'ఒక దేశం – ఒకే ఎన్నిక' అనే అంశంపై జిల్లా స్థాయిలో శనివారం వక్తృత్వ పోటీలు నిర్వహించారు. అందులో స్థానిక గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీలో ఎన్ఎస్ఎస్ వలంటీర్ షకినా గిడియానా ప్రథమ స్థానంలో నిలిచిందని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎండి ధనరాజ్ తెలిపారు. గుంటూరులోని నాగార్జున యూనివర్సిటీలో ఈ నెల 28న జరిగే రాష్ట్ర స్థాయి యూత్ పార్లమెంట్ పోటీలకు కూడా హాజరవుతుందన్నారు.

ఘనంగా దుర్గమ్మ తల్లి వార్షికోత్సవం

బిక్కవోలు: మండలంలోని కొంకుదురు గ్రామ శివారు పంట పొలాల్లో కొలువైన ఉన్న శ్రీ దుర్గమ్మ తల్లి ఆలయం వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఈ సందర్భంగా అమ్మవారికి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం భారీ ఎత్తున అన్న సమారాధన చేశారు. ఈ కార్యక్రమంలోని కొంకుదురు గ్రామస్తులతో పాటు ఊలపల్లి, పందలపాక, కొంకుదురు సావరం తదితర గ్రామాల నుంచి భక్తులు పాల్గొన్నారు.

31న సత్తెమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ



రాట ముహూర్తం చేస్తున్న గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ నేతలు, భక్తులు

పెదపూడి: కరకుదురు గ్రామంలో నూతనంగా నిర్మించిన సత్తెమ్మ తల్లి ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠ ఈ నెల 31వ తేదీ ఉదయం 9.26 గంటలకు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు, వైఖానస పీఠం వ్యవస్థాపకుడు వాడపల్లి గోపాలాచార్యులు తెలిపారు. ఆదివారం ఆలయం వద్ద విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి సంబంధించి రాట ముహూర్తం గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ నేతలు, భక్తులు చేశారు. ఈ సందర్భంగా గోపాలాచార్యులు మాట్లాడుతూ ఈ నెల 29న గ్రామోత్సవం, 30న సంకల్ప దీక్షాధారణ, క్షీరాధివాసం, ప్రధాన హోమం, గోపూజ గోదర్శనం, కుంభ పూజ, పంచ శయ్యాధివాసం, చతుర్వేదాధ్యయనం నిర్వహించనున్నామన్నారు. విగ్రహాల ప్రతిష్ఠ సందర్భంగా ఆలయం వద్ద పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించనున్నారన్నారు. పెద్దాడ సాగునీటి డీసీ చైర్మన్ సానా శ్రీనువాసు, హితకారిణి సమాజం మాజీ డైరెక్టర్ వుంద్రు సత్యనారాయణ, మాజీ సర్పంచులు సింగిసీడి నాగతిరుపతిరావు, సానా రాంబాబు, ఆలయ కమిటీ నేతలు అడపా పెద్ద, తోటకూర వెంకటనాగేశ్వరరావు, పాటంశెట్టి శ్రీను పాల్గొన్నారు.

వరికి తెగుళ్ల బెడద

- తక్షణమే సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి
- రైతులకు ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తల సూచనలు



డాక్టర్ చల్లా వెంకటనరసింహారావు

రాజానగరం: ఆరుగాలం శ్రమించి పంటలు పండించే రైతులకు ఆయా పంటల నుంచి మంచి దిగుబడులతో పాటు మార్కెట్‌లో సరైన గిట్టుబాటు ధర లభించినప్పుడే వారి శ్రమకు తగిన ఫలితం దక్కిందని సంబరపడతారు. అయితే ప్రస్తుత రబీ సీజన్‌లో వరి పంట సాగు ఆశాజనకంగానే జరిగినప్పటికీ కొన్ని ప్రాంతాల్లో తెగుళ్ల బెడద పంట దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపనుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ సీజన్‌లో సమయానికంటే ముందుగానే వరి నాట్లు వేసిన మెట్ట ప్రాంతంలో ఇప్పటికే యంత్రాల సాయంతో కోతలు ప్రారంభం కాగా, మిగిలిన ప్రాంతాలలో వరి పంట వెన్ను తొడిగే దశ, గింజ కట్టే దశలలో ఉంది. ఈ సమయంలో ఎంటీయూ 1121, పిఆర్ 126 వంటి కొన్ని రకాలకు కాండం కుళ్లు పురుగు ఆశించినట్టుగా గుర్తించామని జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ చల్లా వెంకటనరసింహారావు తెలిపారు. దీనివల్ల తెగులు సోకిన పిలకలు/దుబ్బులు కుళ్లి పూర్తిగా ఎండిపోయి, దిగుబడులు పడిపోయే అవకాశం ఉంటుందంటున్నారు. తెగులు సోకినట్టుగా గుర్తించిన వెంటనే తీసుకోవలసిన సస్యరక్షణ చర్యలను తెలియజేశారు.

తెగులు లక్షణాలు

ఈనిక, వెన్ను వేయడం, గింజ గట్టిపడే దశలలో వరి పిలకలు ఎండటం గమనిస్తే దానిని దుబ్బు కుళ్లు తెగులుగా గుర్తించి, నిర్లక్ష్యం చేయకుండా సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. 'స్కిరోషియం ఒరైజే' అనే శిలీంధ్రం లోపం వల్ల వరి పంటను ఈ తెగులు ఆశించి, నష్టం కలిగిస్తుంది. ప్రారంభంలో దుబ్బులో ఒకటి, రెండు వరి పిలకలు ఎండిపోయినట్టుగా కనిపిస్తాయి. క్రమేపీ దుబ్బు అంతటా వ్యాపించి, పంట పక్వానికి రాకుండానే ఎండిపోయేలా చేస్తుంది. కాండం కుళ్లి పోయి, పంట నేలకు ఒరిగిపోతుంది. తెగులు సోకిన పిలకలను చీల్చి చూస్తే లోపలి భాగం అంతా ముదురు గోధుమ రంగుకు లేదా నలుపు రంగుకు మారినట్టుగా గమనించవచ్చు. అదే పూర్తిగా ఎండిపోయిన పిలకలను చీల్చి పరిశీలిస్తే నల్లటి చిన్న చిన్న శిలీంధ్ర బీజాలు పెరగడం కనిపిస్తుంది.



కాండం కుళ్లు తెగులు సోకడంతో కుళ్లిన వరి దుబ్బు



సస్యరక్షణ చర్యలు చేపట్టక ఎండిపోయిన వరి దుబ్బులు

సస్యరక్షణ చర్యలు

కాండం కుళ్లు తెగులు ప్రభావం ఎక్కువగా ఉంటే వెంటనే ఆయా పొలంలో నీరు నిల్వ లేకుండా పూర్తిగా తొలగించి, ఆరబెట్టడం ద్వారా తెగులు తీవ్రతను కొంతవరకు తగ్గించవచ్చు. సుడి దోమ, కాండం తొలుచు పురుగులను సకాలంలో గుర్తించి, నివారణ చర్యలు చేపట్టడం వల్ల కాండం కుళ్లు ఆశించకుండా జాగ్రత్త పడవచ్చు. తెగులు లక్షణాలను గమనించిన వెంటనే ఒక లీటరు నీటిలో హెక్సాకోనజోల్ 2 మి.లీ., లేదా వాలిడమైసిన్ 2 మి.లీ., లేదా ప్రొపికోనజోల్ ఒక మి.లీ., లేదా టెబుకోనజోల్ 2 మి.లీ., కలిపి పంట బాగా తడిసేలా పిచికారీ చేయాలి.



బలభద్రపురంలో వైద్య అధికారులతో మాట్లాడుతున్న డాక్టర్ పద్మావతి

రెండో రోజూ కొనసాగిన క్యాన్సర్ సర్వే

బిక్కవోలు: ప్రజలలో క్యాన్సర్‌పై ఉన్న అపోహలు తొలగించడానికి అనుమానిత కేసులు వెంటనే స్కీనింగ్ చేసే విధంగా చర్యలు చేపట్టాలిని హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్ డాక్టర్ కె.పద్మావతి అన్నారు. ఆదివారం రెండవ రోజు బలభద్రపురం సచివాలయం –3 లో ఏర్పాటు చేసిన ప్రత్యేక క్యాన్సర్ స్కీనింగ్ శిబిరాన్ని ఆమె సందర్శించారు. అనుమానిత క్యాన్సర్ కేసులను గుర్తించడానికి మరికొన్ని రోజులు ఇక్కడ శిబిరాన్ని నిర్వహిస్తామన్నారు. ప్రత్యేక వైద్య నిపుణులతో క్యాన్సర్ స్కీనింగ్ చేయించి నిర్ధారణ పరీక్షల ద్వారా కేసులను గుర్తిస్తామన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జీఎస్ఎల్ ఆసుపత్రి, ఒమీబాబా క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ నుంచి ప్రత్యేక వైద్య సిబ్బంది నిపుణుల ఆధ్వర్యంలో శిబిరం ఏర్పాటు చేశామన్నారు. కాకినాడ రంగరాయ వైద్య కళాశాల సోషల్ ప్రివెంటివ్ మెడిసిన్ విభాగ అధిపతి డాక్టర్ పి సుజాత మాట్లాడుతూ రెండు రోజులుగా 2,803 గృహాలను సందర్శించి 8,830 మందిని పరీక్షించినట్లు తెలియచేశారు. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి శిబిరాన్ని పరిశీలించారు. కొంకుదురు సీహెచ్‌సీ వైద్యులు జి.విజయలక్ష్మి, బిక్కవోలు పీహెచ్‌సీ వైద్యులు దుర్గాదేవి, సర్పంచ్ బుంగా రామారావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు నల్లమిల్లి వెంకట సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

27 నుంచి గుంటూరులో వ్యవసాయ ప్రదర్శన

రాజానగరం: ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం అధ్వర్యంలో ఈ నెల 27 నుంచి 29 వరకు గుంటూరులోని లాంఫామ్‌లో దక్షిణ భారత ప్రాంతీయ వ్యవసాయ ప్రదర్శన జరుగనుందని జిల్లా ఏరువాక కేంద్రం సమన్వయ కర్త డాక్టర్ చల్లా వెంకటనరసింహారావు తెలిపారు. వ్యవసాయ పరిశోధన స్థానాలు, కృషి విజ్ఞాన కేంద్రాలు, ఏరువాక కేంద్రాల వ్యవసాయ పద్ధతులు, కూరగాయలు, పండ్ల సాగులో అధునాతన పద్ధతులు, వ్యవసాయ యాంత్రీకరణ, డ్రోన్లవినియోగం వంటి అంశాలపై ప్రదర్శన ఉంటుందన్నారు. రైతులు, శాస్త్రవేత్తలతో చర్చా కార్యక్రమాలు కూడా జరుగుతాయన్నారు. రాజమహేంద్రవరం నుంచి ఔత్సాహిక రైతులను ఉచితంగా తీసుకువెళ్లడానికి 9032346137 నంబరును సంప్రదించాలన్నారు.

సమ సమాజం కోసం పోరాటం

రంగంపేట: భగత్‌సింగ్ స్ఫూర్తితో సమ సమాజం కోసం పోరాడాలని ఏపీ ఆర్‌సీఎస్ జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు అన్నారు. బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా, భారత ప్రజల విముక్తి కోసం తమ ప్రాణాల్ని అర్పించిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 94వ వర్ధంతిని పురస్కరించుకుని మండల పరిధిలోని సింగంపల్లి గ్రామంలో గల సీపీరెడ్డి నగర్‌లో ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం, అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య, ప్రగతిశీల మహిళా సంఘం (స్త్రీ విముక్తి) ప్రజా సంఘాల ఆధ్వర్యంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల చిత్ర పటాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఏపీ ఆర్‌సీఎస్ నాయకులు చెక్కా సత్తిబాబు అధ్యక్షతన జరిగిన సభలో రాజబాబు మాట్లాడుతూ భగత్‌సింగ్ భారత ప్రజల విముక్తి కోసం బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా పోరాడారన్నారు. భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లు నునూగు మీసాల వయస్సులోనే దేశం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా స్వాతంత్ర్య ఉద్యమానికి జీవంపోసి ఉరికొయ్యలకు బలయ్యారని, వారి త్యాగం ఎనలేనిదని కొనియాడారు. ఏఐఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు డి. నారాయణమూర్తి మాట్లాడుతూ స్వతంత్ర పోరాటంలో సిక్కు సాంప్రదాయానికి వ్యతిరేకంగా తన గడ్డం తీసి మతాలకు అతీతంగా విముక్తి పోరాటమే ధ్యేయంగా వారు పోరాడారు అన్నారు. పారిశుద్ధ్య కార్మికుల సమాఖ్య కన్వీనర్ బొచ్చ ఏసు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ, ఆర్ఎస్ఎస్ వారసత్వాన్ని ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ అందిపుచ్చుకుని మతోన్మాద రాజకీయాలు చేస్తూ ప్రజలను అయోమయానికి గురి చేస్తున్నారని విమర్శించారు. ఏఐఎఫ్‌టీయూ నాయకుడు బంగారు ప్రసాద్, ఏపీ ఆర్‌సీఎస్ నాయకుడు డి.సురేష్, ప్రగతి శీల మహిళా సంఘం నాయకురాలు నర్ల లక్ష్మీదేవి, చెక్కా పద్మ, రమాదేవి పాల్గొన్నారు.



సింగంపల్లిలో భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న సంఘాల నాయకులు



సభలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

పెదపూడిలో భగత్‌సింగ్ వర్ధంతి

పెదపూడి: బ్రిటిష్ వారు కాలంలో దేశంలోని మత విభేదాలే వారికి సహకరించాయని, ఆ వాస్తవాన్ని గ్రహించిన భగత్‌సింగ్ జీవితాంతం మత రాజకీయాలకు వ్యతిరేకంగా పోరాటం చేశాడని భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు జే.వెంకటేశ్వర్లు అన్నారు. పెదపూడిలో ఐఎఫ్‌టీయూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ 94వ వర్ధంతి సభ ఆదివారం నిర్వహించారు. ముందుగా భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ భగత్‌సింగ్ మతోన్మాద రాజకీయాల నుంచి భారతమాతకు విముక్తి కలిగించడానికి కృషి చేశారన్నారు. భగత్ సింగ్ వారసత్వాన్ని కొనసాగించడానికి కార్మికులు, ప్రజలు, శ్రామికులు ముందుకు రావాలన్నారు. తమను పాలిస్తున్న ప్రభుత్వాలు మతోన్మాదాన్ని, కులతత్వాన్ని పెంచి పోషిస్తున్నాయయన్నారు. అమరుడైన భగ్‌త్‌సింగ్ కన్న కలలు నిజం చేయడానికి కార్మికులు, ప్రజలు, శ్రామికులు మతోన్మాదానికి, ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా పోరాటాన్ని చేపట్టాలన్నారు. అప్పుడే భగ్‌త్‌సింగ్‌కు నిజమైన నివాళి అర్పించినట్లు అవుతుందన్నారు. పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకుడు రాగుల రాఘువులు, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు గుబ్బల ఆదినారాయణ మూర్తి, గ్యాస్ డెలివరీ వర్కర్స్ యూనియన్ నాయకులు రాజ్‌కుమార్, లోవరాజు, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు బంగారు సత్యనారాయణ పాల్గొన్నారు.

పేకాట శిబిరాలపై దాడి

సీతానగరం: మండలంలోని కూనవరంలోని వేరు వేరు ప్రాంతాల్లో పేకాటాడుతున్న వారిని అరెస్ట్ చేసి కేసులు నమోదు చేశామని ఎస్సై డి.రామ్‌కుమార్ ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కూనవరం శివారున పేకాటాడుతున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.6,600, మూడు మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు. సీతానగరానికి చెందిన ఐదుగురు, కోరుకొండకు చెందిన ఇద్దరు, రాజమహేంద్రవరానికి చెందిన ఒకరు ఉన్నారు. వారిపై కేసు నమోదు చేశామని, కోర్టులో హాజరుపర్చుతామని ఎస్సై తెలిపారు. కూనవరంలో పేకాటాడుతున్న ఐదుగురిని అరెస్ట్ చేశారు. వీరి నుంచి రూ 1,900 స్వాధీనం చేసుకుని. అదుపులోకి తీసుకున్నారు. వారిపై కేసు నమోదు చేశామని, కోర్టులో హాజరుపర్చుతామని ఎస్సై రామ్‌కుమార్ తెలిపారు.

కోడిపందేలు ఆడుతున్న నలుగురి అరెస్ట్

సీతానగరం: మండలంలోని ఉండేశ్వరపురం శివారున కోడిపందేలాడుతున్న నలుగురిని అరెస్ట్ చేశామని ఎస్సై డి.రామ్ కుమార్ ఆదివారం తెలిపారు. రాజానగరం మండలం కోలామూరుకు చెందిన ఒకరు, రాజమహేంద్రవరం రూరల్ తొర్రేడుకు చెందిన ఇద్దరు, బొబ్బిల్లంకకు చెందిన ఒకరిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.5,500, రెండు పందెం కోళ్లు, రెండు కోడి కత్తులను స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేశామని, వారిని కోర్టులో హాజరుపర్చుతామని తెలిపారు.

సారా నిర్మూలనే లక్ష్యం

మధురపూడి: ప్రజలఆరోగ్యాన్ని నాశనం చేస్తున్న సారా నిర్మూలనే లక్ష్యంగా నవోదయం – 2 ఓ కార్యక్రమాన్ని చేపట్టినట్టు, దానిలో భాగంగా కోరుకొండ సర్కిల్ పరిధిలో అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు సీఐ శ్రీనివాస బాలాజీ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల్లో భాగంగా కార్యక్రమాన్ని రూపొందించినట్టు తెలిపారు. గ్రామీణ ప్రాంతంలో సమాజానికి ఎంతో విలువైన యువత సారా, మత్తు పదార్థాలకు బానిసయ్యిందన్నారు. కార్యక్రమంలో భాగంగా సారా ఉత్పత్తి చేస్తున్నవారు, రవాణా చేస్తున్న వారిని గుర్తించి, వారిపై బైండోవర్ కేసులు నమోదు చేయనున్నట్టు తెలిపారు. అదే వృత్తిగా కొనసాగుతున్న వారిపైనే బైండోవర్ కేసులుంటాయన్నారు. రెగ్యులర్‌గా సారా కేసులు నమోదవుతున్న వారిపై పీడీయాక్టు ప్రకారం కేసులు నమోదు చేస్తున్నామన్నారు. కిరాణా వ్యాపారులు సారా తయారీదారులకు బెల్లం విక్రయాలు జరపకూడదన్నారు. సారా తయారీకి వాడుతున్న నల్లబెల్లం అమ్మకాలు కూడదన్నారు.

నీటి తీరువా వసూలు చేయాలి

బిక్కవోలు: మండలంలోని నీటి తీరువా వసూళ్ల వేగవంతం చేయాలని తహసీల్దార్ బీఎస్‌వీవీ కృష్ణ అన్నారు. ఆదివారం వీఆర్వోలతో జ్యూమ్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రూ.67 లక్షల 89 వేల 444 వసూలు చేయవల్సి ఉండగా ఇప్పటికి 51లక్షల 96వేలు 352 వసూలు అయ్యిందన్నారు. బిక్కవోలు, మోళ్లూరు, పందలపాక, ఊలపల్లి గ్రామాల్లో వసూలు కావాల్సి ఉందన్నారు. రేషన్ కార్డు ఈకెవైసీలు పూర్తి చేయించాలన్నారు.

బీసీ కార్పొరేషన్ రుణాల గడువు పెంపు

బిక్కవోలు: మండలంలోని బీసీ కార్పొరేషన్ రుణాల దరఖాస్తు గడువు పెంచినట్లు ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు గడువు ఈ నెల 22 వరకు ముందుగా ఇచ్చారన్నారు. అయితే దాని ఈ నెల 25వరకు పెంచినట్లు తెలిపారు.

భీమన్న సాహిత్యం నేటి తరానికి ఆదర్శం

- బోయి భీమన్న జీవితం సాహిత్యంపై జాతీయ సదస్సు
- వంద మందికి సర్టిఫికెట్ల ప్రదానం

సీటీఆర్ఐ: భీమన్న సాహిత్యం నేటి తరానికి ఆదర్శం అని భీమన్న సాహితీ నిధి ట్రస్ట్ ఛైర్‌పర్సన్ బోయి హైమావతి అన్నారు. రాజమహేంద్రవరం ఆనం రోటరీ హాల్లో ఆదివారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సాంస్కృతిక శాఖ సౌజన్యంతో తెలుగు అసోసియేషన్ నేషనల్ అకాడమీ ఆఫ్ రికార్డ్స్ ఆధ్వర్యంలో భీమన్న జీవితం సాహిత్యం జాతీయ సదస్సు నిర్వహించారు. సదస్సు కన్వీనర్ డాక్టర్ టి.పార్థసారథి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో బోయి భీమన్న సతీమణి హైమావతి ప్రసంగించారు. నేటి ఆధునిక కవులకు భీమన్న సాహిత్యం ఒక దిక్సూచిలా నిలుస్తుంది అన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నర్సిపల్లి హారిక మాట్లాడుతూ రాజమహేంద్రవరంలో జాతీయ సదస్సు నిర్వహించడం అభినందనీయం అన్నారు. శ్రీ శ్రీ కళా వేదిక సీఈవో కత్తి మండ ప్రతాప్ మాట్లాడుతూ సాహిత్యం సమాజహితమని సదస్సులో వందమంది పత్ర సమర్పణ చేయడం అభినందనీయం అన్నారు. నన్నయ యూనివర్సిటీ ఆచార్యులు డాక్టర్ తరపట్ల సత్యనారాయణ మాట్లాడుతూ భీమన్న సాహిత్యంలో అనేకమంది విద్యార్థులు పీహెచ్‌డీ పట్టాను పొందారన్నారు. బోయి భీమన్న జీవిత చరిత్ర పై జరగిన కవిత పోటీలలో 15 మంది విజేతలుగా నిలిచారు. వీరికి సర్టిఫికెట్లతో పాటుగా నగదు పురస్కారం అందించారు. వీరితో పాటుగా మరో వంద మందికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. శ్రీ శ్రీ కళావేదిక జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి, అధ్యక్షురాలు ఈశ్వరి భూషణం, మహిళా అధ్యక్షురాలు చిట్టే లలిత, ప్రధాన కార్యదర్శి, ప్రోగ్రాం కన్వీనర్ డాక్టర్ టి.పార్థసారథి, జాతీయ కల్చరల్ డైరెక్టర్ డేబా విజయ్ కుమార్, నూకా సంపత్, బాలార్జున సత్యనారాయణ, బి.వి.వి. సత్యనారాయణ, తాటి హరీష్, కాపురపు రవికుమార్ పోషణ జాతీయకుమార్ పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న బోయి హైమావతి తదితరులు



నగదు పురస్కారాన్ని అందుకున్న కవులు

సమాజానికి దిక్సూచిలా సాహిత్యం



సాహిత్యం సామాజిక దురాగతాలపై స్పందించేలా ఉండాలి. కవిత్వంలో జన జీవితాలను రాయాలి. కవిత్వం నేటి వాస్తవ పరిస్థితులపై స్పందించాలి. అప్పుడే ఆ కవిత్వానికి, రచయితకు సార్థకత చేకూరి ఆ కవిత్వం పది కాలాలపాటు నిలుస్తుంది. కవులు కళాకారులను ప్రోత్సహించే దిశగా రాష్ట్ర వ్యాప్తంగా సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో నెల నెలా ఒక్కో జిల్లాలో జాతీయ స్థాయిలో శతాధిక కవిసమ్మేళనాలు, సాహిత్య సదస్సులు నిర్వహిస్తున్నాం. ఇంతవరకు 146 జాతీయ కార్యక్రమాలు నిర్వహించి వేలాదిమంది కళాకారులను ప్రోత్సహించాం.

– **కత్తిమండ ప్రతాప్**, శ్రీ శ్రీ కళావేదిక సి.ఈ.ఓ, బోయి భీమన్న కవి పురస్కార గ్రహీత, ప్రముఖ రచయిత, కవి

దళితుల ఆత్మగౌరవం... బోయి భీమన్న



కూడు లేక, గూడులేక, కడు పేదరికంలో హీనంగా, దీనంగా ఆకలి కేకలతో విలపిస్తున్న దళితుల గోడు వినేవారు లేరని బోయిభీమన్న తన కవిత్వంలో వెల్లడించారు. దళితుల ఆత్మగౌరవాన్ని నిలిపిన శక్తి బోయి భీమన్న. చైతన్య శక్తిగా దళిత కవిత్వం కొనసాగించారు.

– **గొట్టిముక్కల నాసరయ్య**, కవి, రచయిత, ప్రకాశం జిల్లా

బహుమతి గెలుచుకోవడం ఆనందం



డాక్టర్ బోయి భీమన్న జీవితం సాహిత్యం అనే అంశంపై రాజమహేంద్రవరం పట్టణంలో నిర్వహించిన జాతీయ సదస్సులో ప్రోత్సాహక బహుమతిని గెలుచుకోవడం ఆనందదాయకంగా ఉంది. కవిత్వానికి పట్టం కట్టి, సాహిత్యాన్ని దేశ విదేశాలలోనే కాక మారుమూల ప్రాంతాలకు కూడా విస్తరింప చేస్తూ మట్టిలో మాణిక్యాలను వెలికి తీస్తున్న శ్రీశ్రీకళావేదికని అభినందిస్తున్నాను.

– **పూర్ణిమ ఎర్రంశెట్టి**, భద్రాచలం

కులమతాలకు అతీతంగా...



బోయిభీమన్న మంచి సామాజిక మార్పు కాంక్షించిన క్రాంతిదర్శి. పద్మశ్రీ, పద్మభూషణ్, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుకు ఎదిగిన గొప్ప వ్యక్తి. కుల మతాలకు తావులేకుండా సమానత్వం కలిగి ఉండాలన్నదే బోయిభీమన్న తన సాహిత్యంలో సూచించారు.

– **డాక్టర్ టి. పార్థసారథి**, జాతీయ ప్రధాన కార్యదర్శి, కొయ్యలగూడెం

కవన సేద్యం చేస్తున్నందుకు కృతజ్ఞతలు



రాజమహేంద్రవరంలో ప్రథమ స్థానంలో నిలిచి జాతీయ సదస్సులో బహుమతిని స్వీకరించడం చాలా ఆనందంగా ఉంది. కవన సేద్యం చేస్తున్న శ్రీశ్రీ కళావేదిక, భీమన్న సాహితీ నిధి ట్రస్టు, తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ బుక్ ఆఫ్ రికార్డ్స్, ఏపీ భాషా సాంస్కృతిక శాఖకి కృతజ్ఞతలు.

– **కాపురపు రవికుమార్ (విరాగి)**, మంచిర్యాల

నిబంధనల మేరకు భవన నిర్మాణాలు

రాజమహేంద్రవరం సిటీ: నగర పరిధిలోని భవనాలు నిబంధనల మేరకు నిర్మించాలని లేని పక్షంలో చర్యలు తప్పవని నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ ఖర్గ్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలో గాదాలమ్మనగర్ రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్ ఆక్యుపెన్సీ ఫైల్‌ను పరిశీలించారు. భూగర్భ జలాల పెంపు కోసం నిర్మించిన వర్షపు నీటి సంరక్షణ గుంతలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవనం ఎత్తు, సెట్ బ్యాక్‌లు, అపార్ట్‌మెంట్‌కు యాక్సెస్ కలిగిన రహదారి వెడల్పు, పట్టణ నిర్మాణ నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయన్నారు. భవనం రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్‌గా మంజూరు పొంది, అనుమతి ప్రణాళికకు ఎటువంటి వ్యత్యాసం లేకుండా నిర్మించడం అభినందనీయమన్నారు. సంబంధిత అధికారులు భవన పరిపాలన నిబంధనలను క్రమంగా పాటిస్తూ, పట్టణ ప్రణాళికకు అనుగుణంగా భవన నిర్మాణాలను నిర్ధారించేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిటీ ప్లానరు జి.కోటయ్య, డిప్యూటి సిటీ ప్లానరు సత్యనారాయణ రాజు, పట్టణ ప్రణాళిక విభాగ అధికారులు పాల్గొన్నారు.



అపార్ట్‌మెంట్ ప్లాన్ చూస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్

విద్యార్థినికి అభినందన

కంబాలచెరువు: స్థానిక ఆర్ట్స్ కళాశాలలో బయోటెక్నాలజీ విభాగం నుండి డాక్టర్ కె.అనూష మెంటార్‌షిప్‌లో ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్‌లో సమ్మర్ రీసెర్చ్ ఇంటర్న్ షిప్–2025నకు పి.సాయిశ్రేయ ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కె తెలిపారు. అమిటీ యూనివర్సిటీ కోల్‌కతాలో డాక్టర్ భట్టాచార్య అశీమ ఆధ్వర్యంలో ఈ ప్రాజెక్టు పూర్తి చేయాలన్నారు.. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర, బయోటెక్నాలజీ శాఖాధిపతి డాక్టర్ బి.నాగేశ్వరి విద్యార్థిని అభినందించారు.